సాక్షి పశ్చిమగోదావరి

శుక్రవారం । 14 । ఫిబ్రవరి । 2025



విగ్రహ ప్రతిష్ఠా ఉత్సవాలు

తాడేపల్లిగూడెం రూరల్: కుంచనపల్లి ద్వారకానగర్‌లో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు ప్రారంభమయ్యాయి.



వీరభద్రస్వామి రథోత్సవం

కామవరపుకోట: కామవరపుకోటలో వీరభద్ర రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి త్రిశూల స్నానం, వసంతోత్సవం జరిపించారు.



ఓం సాయి.. శ్రీ సాయి..

కాళ్ల: దొడ్డనపూడిలో షిరిడీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఆలయ ధర్మకర్త వెలివెల సుబ్రమణ్య దంపతులు ప్రత్యేక హోమాలు చేశారు.

న్యూస్‌రీల్

అధికారం శాశ్వతం కాదు



కారుమూరి సునీల్‌కుమార్

సాక్షి ప్రతినిధి, ఏలూరు: 'అధికారం ఏ ఒక్కరికీ శాశ్వతం కాదు.. ఎమ్మెల్యే అయి ఉండి హుందాగా ప్రవర్తించాల్సింది పోయి వీధిరౌడీలా ప్రవర్తిస్తావా? చింతమనేనీ.. ఇది సరికాదు... కూటమి నాయకులంతా ఇది గమనించాలి..' అంటూ వైఎస్సార్‌సీపీ ఏలూరు పార్లమెంట్ సమన్వయకర్త కారుమూరి సునీల్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ బుధవారం రాత్రి పెదపాడు మండలం వట్లూరులో మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఓ వివాహానికి హాజరుకాగా.. స్థానికులు ఆయనపై చూపిన ఆదరాభిమానాలను ఎమ్మెల్యే చింతమనేని చూసి తట్టుకోలేకపోయారన్నారు. ఆ అక్కసంతా అబ్బయ్యచౌదరి డ్రైవర్‌పై తీర్చుకున్నారని తెలిపారు. కారు దారిలో అడ్డంగా లేకపోయినా ఎందుకు అడ్డంగా పెట్టావంటూ తీవ్ర పదజాలంతో దూషించడం తీవ్ర అభ్యంతరకరమన్నారు. అక్కడకు వచ్చిన వైఎస్సార్‌సీపీ నాయకులు జానంపేట బాబు, వేమూరి జితేంద్ర, కృష్ణారావు, ప్రవీణ్‌లపై రాడ్డుతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారన్నారు. ఏపీలో ప్రజాస్వామ్యం ఉందా అని సునీల్ ప్రశ్నించారు. ఒక ఎమ్మెల్యే వీధి రౌడీలా ప్రవర్తిస్తే సామాన్యులు ఎలా బతుకుతారని నిలదీశారు. తాము అధికారంలోకి వచ్చిన తరువాత వీటన్నింటికీ సమాధానమిస్తామని, అన్ని లెక్కలూ సరి చేస్తామని సునీల్‌కుమార్ స్పష్టం చేశారు.

ఫ్లెక్సీలకు ముసుగులు



గవరపేటలో ఫ్లెక్సీలకు ముసుగు వేసిన దృశ్యం

సాక్షి స్పందన

పాలకొల్లు అర్బన్: 'గ్రామాల్లో తొలగని ఫ్లెక్సీలు.. ఎన్నికల నిబంధనలకు తూట్లు' శీర్షికన 'సాక్షి'లో ప్రచురించిన కథనానికి పంచాయతీ కార్యదర్శి ఎం.దిలీప్ స్పందించారు. గురువారం పాలకొల్లు మండలం గవరపేటలోని మెయిన్‌రోడ్డు, ముఖ్య కూడళ్లలో ఫ్లెక్సీలకు క్లాత్‌తో ముసుగులు వేయించినట్టు చెప్పారు. ఎక్కడా ఫ్లెక్సీలు కట్టరాదని గ్రామంలో టాం టాం వేయించామన్నారు.

ఇంటర్ ప్రాక్టికల్స్‌కు 89 మంది గైర్హాజరు

భీమవరం: ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్ పరీక్షలకు గురువారం 89 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఇంటర్మీడియెట్ జిల్లా విద్యాశాఖాధికారి ఎ.నాగేశ్వరరావు చెప్పారు. ఉదయం షిఫ్టులో 1,981 మందికి 1,889, మధ్యాహ్నం షిఫ్టులో 1,893 మందికి 1,833 మంది హాజరయ్యారని, ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని చెప్పారు.

కట్టుదిట్టమైన చర్యలు

భీమవరం (ప్రకాశంచౌక్): రాష్ట్ర ప్రభుత్వం బర్డ్‌ఫ్లూ నివారణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుందని, ప్రజలు వదంతులను నమ్మవద్దని, జిల్లాల్లో కోళ్ల పూడ్చివేత ప్రక్రియ ఎస్‌ఓపీ ప్రకారం నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ తెలిపారు. గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి రాష్ట్ర పశుసంవర్ధక, వైద్య ఆరోగ్య శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులతో కలిసి కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. భీమవరం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్ చదలవాడ నాగరాణి హాజరయ్యారు. బర్డ్‌ఫ్లూ సోకిన పశ్చిమగోదావరి జిల్లా వేల్పూరు, ఏలూరు జిల్లా బాదంపూడి, తూర్పుగోదావరి జిల్లా కానూరు, ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం ప్రాంతాల్లోని ఐదు పౌల్ట్రీల్లో చేపట్టిన చర్యలను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో వైరస్ నివారణకు తీసుకున్న చర్యలను కలెక్టర్ నాగరాణి వివరించారు.

ధాన్యం సేకరణకు ముందస్తు చర్యలు

ఏలూరు(మెట్రో): రానున్న 2024–25 రబీ పంట కాలంలో ధాన్యం సేకరణకు సంబంధించి రైతుల పంట వివరాలు పూర్తి పారదర్శకంగా చేపట్టి ఈకేవైసీ త్వరితగతిన పూర్తి చేయాలని జేసీ పి.ధాత్రిరెడ్డి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో రబీ ధాన్యం సేకరణకు ముందస్తు ప్రణాళిక అమలులో భాగంగా అధికారులతో ఆమె సమీక్షించారు. రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం విక్రయించేందుకు కావాల్సిన గోనె సంచులను రైస్ మిల్లర్లు ముందస్తుగానే పరిశీలించి సిద్ధం చేసుకోవాలన్నారు. ధాన్యం సేకరణపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు.

ఉమ్మడి పశ్చిమలో బర్డ్‌ఫ్లూ కలకలం రేపుతోంది. ఇప్పటికే వేల్పూరులో వైరస్ నిర్ధారణ కాగా.. తాజాగా బాదంపూడిలోని పౌల్ట్రీలో భారీ సంఖ్యలో కోళ్లు చనిపోవడానికి బర్డ్‌ఫ్లూ కారణమని తేలింది. ఈ మేరకు రిపోర్టులు అందడంతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది.

బర్డ్‌ఫ్లూ టెర్రర్



ఉంగుటూరు మండలం బాదంపూడిలోని పౌల్ట్రీలో చనిపోయిన కోళ్లు



బాదంపూడిలో కల్లింగ్ చేస్తున్న సిబ్బంది



బాదంపూడిలో రెడ్‌జోన్ ఫ్లెక్సీ ఏర్పాటు



మేడపాడులోని ఫారంలో చనిపోయిన కోళ్లు

గుడ్లు తేలేస్తున్న కోళ్లు

- బాదంపూడిలో బయటపడ్డ వైరస్
- అధికారులు అప్రమత్తం
- నివారణ చర్యల్లో నిమగ్నం
- ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు
- ప్రజలు జాగ్రత్తలు పాటించాలని సూచన

సాక్షి, భీమవరం/నిడమర్రు/గణపవరం: ఉంగుటూరు మండలం బాదంపూడిలోని శ్రీవెంకట మణికంఠ పౌల్ట్రీలో కొద్దిరోజులుగా ఉదయానికి వేల సంఖ్యలో కోళ్లు చనిపోతున్నాయి. ఇప్పటివరకు సుమారు లక్ష కోళ్లు మృత్యువాతపడ్డాయి. పశుసంవర్ధకశాఖ అధికారులు కోళ్ల శాంపిల్స్‌ను సేకరించి ల్యాబ్‌కు పంపగా రిపోర్టులు అందాయి. బర్డ్‌ఫ్లూ పాజిటివ్‌గా నిర్ధారణ కావడంతో ఏలూరు కలెక్టర్ కె.వెట్రిసెల్వి గురువారం పశుసంవర్ధక, పంచాయతీ, వైద్య ఆరోగ్య, అటవీ, రెవెన్యూ తదితర శాఖల అధికారులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. బర్డ్‌ఫ్లూపై ప్రజలను అప్రమత్తం చేసేలా ఆయా శాఖల అధికారులకు ఆదేశాలిచ్చారు. వైరస్ గుర్తించిన వెంకట మణికంఠ పౌల్ట్రీకి కి.మీ వరకు ఇన్ఫెక్షన్, 10 కి.మీ వరకు అలర్ట్ జోన్‌గా గుర్తించారు.

వైరస్ నిర్మూలనలో భాగంగా మణికంఠ పౌల్ట్రీతో పాటు కిలోమీటరు పరిధిలోని పౌల్ట్రీల్లోని లేయర్, బ్రాయిలర్, ఇళ్ల వద్ద పెంచే నాటు కోళ్లను శాస్త్రీయ పద్ధతిలో పూడ్చిపెట్టేందుకు వెటర్నరీ వైద్యులతో 20 ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేశారు. ఎక్కడైనా పౌల్ట్రీల్లో కోళ్లు మృత్యువాత పడుతుంటే వెంటనే పశు సంవర్ధక శాఖ అధికారులకు సమాచారం అందించాలని కోరుతూ 9966779943 టోల్ ఫ్రీ నంబర్‌తో పాటు కమాండ్ కంట్రోల్ సెంటర్‌ని కూడా ఏర్పాటు చేశారు. అలర్ట్ జోన్ పరిధిలో ప్రత్యేక పారిశుధ్య నిర్వహణకు ఆదేశాలిచ్చారు.

చికెన్, గుడ్లకు దూరంగా ఉండాలి

బాదంపూడికి పది కిలోమీటర్ల పరిధిలోని గ్రామాల ప్రజలు కొన్ని రోజుల పాటు చికెన్, కోడిగుడ్లకు దూరంగా ఉండాలని, అయితే బాగా ఉడకబెట్టిన గుడ్లు, కోడి మాంసం ఏమాత్రం హానికరం కాదని పశుసంవర్ధక శాఖ అధికారులు తెలిపారు. అలర్ట్ జోన్ పరిధిలో పౌల్ట్రీ ఉత్పత్తుల రవాణపై నిఘా ఉంటుందని, ఈ పరిధిలో 144, 133 సెక్షన్ అమల్లో ఉంటాయని వివరించారు. వైరస్ లక్షణాలు కనిపిస్తే యాంటీ వైరస్ మందులు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని, ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని ఏలూరు జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ టి.గోవిందరాజు విజ్ఞప్తి చేశారు. ఇదిలా ఉండగా బాదంపూడి పరిసరాల్లోని ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లా సరిహద్దుల్లో గల ఆరు పౌల్ట్రీల్లో రూ.74 లక్షల విలువైన 49,500 కోళ్లు మృతి చెందినట్టుగా అధికారులు గుర్తించినట్టు సమాచారం.

85 వేల కోళ్ల కల్లింగ్

ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్ (ఆర్ఆర్‌టీ)లు గురువారం సాయంత్రం బాదంపూడి కోళ్ల ఫారంలో మిగిలిన 85 వేల కోళ్లను పూడ్చే కార్యక్రమం (కల్లింగ్) నిర్వహించారు. ఈ ప్రాంతాన్ని నిషేధిత ప్రాంతంగా ప్రకటించారు. బాదంపూడిలో రెడ్‌జోన్‌గా ప్రకటించిన దారుల్లో నిడమర్రు సీఐ ఎంవీ సుభాష్, ఎంపీడీఓ రాజ్‌మనోజ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీస్ చెక్‌పోస్ట్ ఏర్పాటుచేశారు. గత ఆరు రోజుల్లో పౌల్ట్రీ నుంచి కోళ్లను ఏఏ ప్రాంతాలకు వాహనాల ద్వారా రవాణా చేసేరో వంటి సమాచారాన్ని సేకరిస్తున్నట్టు చేబ్రోలు ఎస్సై ఎం.సూర్యభగవాన్ తెలిపారు. సంబంధిత ప్రాంతాల్లోని చికెన్ షాపులను కొద్ది రోజులపాటు మూసివేసేలా చర్యలు తీసుకున్నామన్నారు.

ఎవరికీ బర్డ్‌ఫ్లూ సోకలేదు

బాదంపూడిలో ఏలూరు డీఎంహెచ్‌ఓ ఆర్.మాలిని విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఇప్పటివరకూ రాష్ట్రంలో ఏ ఒక్క మనిషికీ బర్డ్‌ఫ్లూ వచ్చిన దాఖలాలు లేవన్నారు. బాదంపూడి పౌల్ట్రీలో పని చేసే వ్యక్తికి బర్డ్‌ఫ్లూ నిర్ధారణ అయ్యిందంటూ వస్తున్న వార్తల్లో నిజం లేదన్నారు. సోషల్ మీడియాలో వస్తున్న వార్తలను ప్రజలు నమ్మవద్దని ఆమె సూచించారు.

మేడపాడులో 5,500 కోళ్లు మృత్యువాత

యలమంచిలి: యలమంచిలి మండలంలోని మేడపాడు గ్రామంలో కడలి ఆంజనేయులు అనే కోళ్ల రైతుకు చెందిన ఫారంలో గురువారం ఉదయం 5,500 బ్రాయిలర్ కోళ్లు మృత్యువాత పడ్డాయి. పశుసంవర్ధక శాఖ అధికారులు కోళ్ల శాంపిల్స్‌ను సేకరించి విజయవాడ, భోపాల్ పరీక్షా కేంద్రాలకు పంపారు. అనంతరం పొక్లయిన్‌తో కోళ్లను గొయ్యిలో ఖననం చేశారు. ఫారంను సీజ్ చేసినట్టు పశుసంవర్ధక శాఖ భీమవరం ప్రాంతీయ ఉప సంచాలకుడు జవార్ హుస్సేన్ చెప్పారు. గ్రామంలో కిలోమీటర్ వరకు డెడ్‌జోన్‌గా ప్రకటించామన్నారు. పాలకొల్లు ప్రాంతీయ సహాయ సంచాలకులు డాక్టర్ గంజనబోయిన మల్లేశ్వరరావు, మండల పశు వైద్యాధికారి పోరెడ్డి చంద్రశేఖరరెడ్డి ఉన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

శాస్త్రీయ పద్ధతిలో కోళ్ల పూడ్చివేత

తణుకు అర్బన్: ఇన్‌ఫెక్షన్ జోన్‌లో పూర్తిస్థాయి శాస్త్రీయ పద్ధతిలో కోళ్ల పూడ్చివేత ప్రక్రియ ప్రత్యేక బృందంచే నిర్వహిస్తున్నట్టు పశ్చిమగోదావరి కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. గురువారం తణుకు మండలం వేల్పూరులో కృష్ణానందం కోళ్ల ఫారం షెడ్లను ఆమె పరిశీలించారు. ఐదు షెడ్లలో వైరస్ సోకిన కోళ్ల పూడ్చివేత ప్రక్రియను 22 ఆర్ఆర్‌టీ బృందాల ఆధ్వర్యంలో చేపట్టామన్నారు. పౌల్ట్రీలో సుమారు 20 వేల కోళ్ల వరకు ఉన్నాయని, కోళ్ల పూడ్చివేత అనంతరం షెడ్లను పూర్తిస్థాయిలో డిస్ఇన్ఫెక్ట్ చేస్తామన్నారు. సమీప పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించేలా ఆదేశాలు జారీ చేశామన్నారు. మనుషులకు వైరస్ సోకిందన్న వార్తల్లో నిజం లేదని స్పష్టం చేశారు. ఆర్డీఓ ఖతీబ్ కౌసర్ భానో, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి కె.మురళీకృష్ణ, జిల్లా ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ బి.భానునాయక్, తహసీల్దార్ డీవీఎస్ఎస్ అశోక్‌వర్మ ఉన్నారు.

మనుషులకు హాని లేదు : బర్డ్ ఫ్లూ, ఏవీఎన్ ఇన్ఫ్లూయంజా వల్ల మనుషులకి ఎలాంటి హాని ఉండబోదని, కోడి మాంసం, గుడ్లు తినొచ్చని శ్రీ వెంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం మైక్రో బయాలజీ ప్రొఫెసర్ డాక్టర్ కేవీ సుబ్రహ్మణ్యం తెలిపారు. వేల్పూరులో కోళ్ల ఫారమ్స్‌ను ప్రొఫెసర్ల బృందంతో కలిసి పరిశీలించారు. వేల్పూరులో అధికార యంత్రాంగం చేపట్టిన రక్షణ చర్యలు సంతృప్తిగా ఉన్నాయన్నారు. కోళ్ల పూడ్చివేత తర్వాత షెడ్లను కెమికల్స్‌తో క్రిమిరహితం చేస్తారని, అనంతరం షెడ్లను సీల్ చేసి మూడు నెలల తర్వాత తెరిచేలా అనుమతిస్తారన్నారు.

వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుంది



మాజీ ఎమ్మెల్యే తండ్రి రామచంద్రరావును కలిసిన వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు డీఎన్నార్

ఏలూరు టౌన్: జిల్లాలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అంతా ఐక్యంగా కూటమి ప్రభుత్వ అరాచకాలపై పోరాటం చేస్తున్నారని, ప్రజల పక్షాన ఎల్లవేళలా పోరుబాట పడతామని వైఎస్సార్‌సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు అన్నారు. బుధవారం రాత్రి ఏలూరు శివారు వట్లూరు ప్రాంతంలో పద్మావతి గార్డెన్స్‌లో వివాహ వేడుకలకు హాజరైన దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు, దౌర్జన్యానికి పాల్పడిన సంఘటనపై గురువారం కొఠారు రామచంద్రరావును ఆయన స్వగృహంలో కలిశారు. కొఠారు ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీయటంతోపాటు నియోజకవర్గంలో కూటమి అరాచకాలపై చర్చించారు. మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, పార్టీ నేతలపై ఎమ్మెల్యే చింతమనేని అక్రమ కేసులు బనాయించటం, దౌర్జన్యానికి పాల్పడడం సరికాదన్నారు. వివాహ వేడుకలను సైతం రాజకీయంగా గొడవకు వేదికగా మార్చటం సమంజసం కాదని అభిప్రాయపడ్డారు. వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెడితే వారికి అండగా నిలుస్తామని డీఎన్నార్ స్పష్టం చేశారు.

చింతమనేనీ.. పద్ధతి మార్చుకో!

- రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారా?
- మాజీ ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి ఆగ్రహం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి



కారు డ్రైవర్ నాగరాజుపై విరుచుకుపడుతున్న ఎమ్మెల్యే చింతమనేని

పెదవేగి: కూటమి ప్రభుత్వం ఏర్పడి 8 నెలలు గడిచినా దెందులూరు నియోజకవర్గంలో కక్ష సాధింపు చర్యలు ఆపడం లేదని మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి అన్నారు. గురువారం రాయన్నపాలెంలోని క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇది ఏ రాజ్యాంగం? రెడ్‌బుక్ రాజ్యాంగమా లేక టీడీపీ రాజ్యాంగమా? అంటూ ప్రశ్నించారు. ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తాగిన మైకంలో మాట్లాడిన భాష, ప్రవర్తించిన తీరును రాష్ట్ర ప్రజలంతా వీడియోలో చూశారన్నారు. నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల సంక్షేమం గురించి ఆలోచించడం మాని తప్ప తాగిన మైకంలో వైఎస్సార్‌సీపీ నాయకులను కొట్టడం ఏంటని నిలదీశారు. ఎమ్మెల్యేనే నియోజకవర్గంలో తిరగాలా.. మిగిలిన వారికి తిరిగే స్వాతంత్ర్యం లేదా అన్నారు.

ఇదెక్కడి సంప్రదాయం..

'మా ఇంటి ముందుకు వచ్చి డప్పులు కొట్టించడం.. మా పొలాల్లో మందు తాగేలా చేయడం.. తోటల్లో రౌడీలను తీసుకువచ్చి బెదిరించే పద్ధతి.. ఇదంతా ఎక్కడి సంప్రదాయం..' అంటూ కొఠారు ప్రశ్నించారు. అధికారం ఎప్పుడూ ఒకరి పక్కనే ఉండదని గుర్తుచేశారు. కూటమి పాలనలో నియోజవర్గంలో చేసిన అభివృద్ధి ఏంటని ప్రశ్నించారు. వాట్సాప్‌లో మెసేజ్ పెడితే మద్యం డోర్ డెలివరీ చేసే పరిస్థితి నియోజకవర్గంలో ఉందన్నారు. ఇసుక మాఫియా రెచ్చిపోతోందని, పొలాలను అక్రమంగా దోచుకునే పరిస్థితులు వచ్చాయంటూ విమర్శించారు. కృత్రిమ గొడవలు సృష్టించాల్సిన అవసరం తమకు ఏముందని కొఠారు అన్నారు.

గతంలో ప్రశాంత వాతావరణం

ఇప్పుడు ఏమైనా ఎన్నికలు ఉన్నాయా.. మేం తలుచుకుంటే వాళ్లు తిరగగలుగుతారా అని కొఠారు అన్నారు. రాజకీయాలు కేవలం ఎన్నికల వరకే ఉండాలని, గతంలో ప్రశాంత వాతావరణ ఉండేదని అన్నారు. నియోజకవర్గంలో చింతమనేనిని ప్రజలు అసహ్యించుకుంటున్నారని, తాను ఎమ్మెల్యేగా ఉండగా ఎవరిపైనా వేధింపులకు పాల్పడలేదని కొఠారు అన్నారు. చింతమనేని తండ్రి చనిపోయినప్పుడు తమ పార్టీ కార్యకర్తలు వద్దని వారించినా తాను వెళ్లి భౌతికకాయంపై పూలమాల వేసి నివాళులర్పించానని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వంలో నియోజకవర్గంలో సుమారు 560కి పైగా శిలాఫలకాలు ధ్వంసం చేయడం విచారకరమన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో పార్టీలకతీతంగా పథకాల లబ్ధిని చేకూర్చామన్నారు. నియోజకవర్గంతో పాటు కొల్లేరులో ఎక్కడైనా తనకు తప్పు చేయాల్సిన అవసరం ఏముందని మాజీ ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి ప్రశ్నించారు.

అకారణంగా దాడి చేశారు

అబ్బయ్యచౌదరి డ్రైవర్ నాగరాజు మాట్లాడుతూ తాను ఎమ్మెల్యే చింతమనేని కారుకు అడ్డు పెట్టలేదని, ఆయన కారు వెళ్లే మార్గం చాలా వెడల్పుగా ఉందని అన్నారు. అకారణంగా తనను, తన తల్లిని దూషించి దౌర్జన్యం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ పెదవేగి మండల అధ్యక్షుడు జానంపేట బాబు మాట్లాడుతూ తనను రెండు చేతులపై కొట్టి గాయపరిచారని, దెందులూరు మండల వైస్ ఎంపీపీ వేమూరి జితేంద్ర, పెదవేగి మండల సీనియర్ నేత మేడికొండ కృష్ణారావులను ఇనుప వస్తువుతో కొట్టారని వాపోయారు. ఎమ్మెల్యే చింతమనేనికి తనకు మధ్య ఎలాంటి వివాదాలు లేవని, ఆయన గురించి తాము ఎక్కడా మాట్లాడలేదని, అకారణంగా కొట్టడం ఏంటని అన్నారు. జెడ్పీ వైస్ చైర్మన్ పి.విజయబాబు, వడ్డీల కార్పొరేషన్ రాష్ట్ర మాజీ చైర్మన్ ముంగర సంజీవ్ కుమార్, ఫారెస్ట్ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ పల్లం ప్రసాద్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కామిరెడ్డి నాని, ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు తేరా ఆనంద్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాటి సుధాకర్, పెదపాడు ఎంపీపీ బత్తుల రత్నకుమారి ఏసురాజు, దెందులూరు జెడ్పీటీసీ నిట్టా లీలా నవకాంతం గంగరాజు, సర్పంచులు బోదుల స్వరూప్, సునీత రఘు, ప్రభుదేవా, ఎంపీటీసీ అంగడాల వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ అంగడాల సీతారావమ్మ తదితరులు పాల్గొన్నారు.

కోడ్ కచ్చితంగా అమలు చేయాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఎన్నికల పరిశీలకురాలు సునీత

ఏలూరు(మెట్రో): ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పటిష్టంగా అమలుచేయాలని తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల పరిశీలకురాలు కె.సునీత ఆదేశించారు. గురువారం గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలపై ఏలూరు కలెక్టరేట్ నుంచి ఆయా జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో సమీక్షించారు. మొత్తంగా 3,14,984 మంది ఓటర్లు ఉండగా 456 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. 70 జోన్లు ఏర్పాటుచేసి 70 మంది జోనల్ అధికారులు, 95 మంది రూట్ ఆఫీసర్లను నియమించామన్నారు. ఎన్నికలను సజావుగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల ఏర్పాట్లను పరిశీలించాలని, సిబ్బందికి శిక్షణ ఇవ్వాలన్నారు. కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసుకోవాలని, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఏలూరులో కౌంటింగ్‌కు పటిష్ట ఏర్పాట్లుచేయాలన్నారు. కలెక్టర్ కె.వెట్రిసెల్వి, జిల్లా ఎస్పీ ప్రతాప శివకిషోర్ పాల్గొన్నారు.

అభ్యర్థులతో సమావేశం : పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికకు సంబంధించి ఏలూరు కలెక్టరేట్‌లో ఎన్నికల పరిశీలకురాలు కె.సునీత సమక్షంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ కె.వెట్రిసెల్వి పోటీలో నిలిచిన అభ్యర్థులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల కోడ్ తప్పక పాటించాలని కోరారు.

సర్వేను వేగిరపర్చాలి

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలోని ప్రతి మండలంలో ఒక గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా తీసుకొని చేపట్టిన సర్వేను వేగవంతం చేసి, సత్ఫలితాలు సాధించాలని కలెక్టర్ నాగరాణి అన్నారు. గురువారం క్యాంపు కార్యాలయం నుంచి జేసీ టి.రాహుల్‌కుమార్‌రెడ్డితో కలిసి ఆమె సర్వే తీరుపై సమీక్షించారు. భూ యజమానులకు నోటీసులు అందజేత తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు.

పీడీఎఫ్ అభ్యర్థి విస్తృత ప్రచారం



ఓట్లు అభ్యర్థిస్తున్న వీర రాఘవులు

ఏలూరు (టూటౌన్): గత 35 ఏళ్లుగా ఉపాధ్యాయులు, ఉద్యోగులు, కార్మికులు, నిరుద్యోగుల సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తున్న తనకు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని పీడీఎఫ్ అభ్యర్థి దిడ్ల వీర రాఘవులు విస్తృత ప్రచారం చేశారు. గురువారం ఏలూరు బార్ అసోసియేషన్, సీఆర్ఆర్ విద్యాసంస్థలు, కాలేజీలు, ప్రభుత్వ కార్యాలయాలు, హైస్కూల్స్, వాకర్స్ గ్రౌండ్స్, వివిధ సంఘాల పెద్దలను కలిసి ఓట్లు అభ్యర్థించారు. ఐదు ప్రాంతాల్లో సమావేశాలు నిర్వహించారు. ఉద్యోగాల కల్పన, ఉద్యోగుల పీఆర్‌సీ, ఐఆర్, ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలు, ఎయిడెడ్ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం కృషిచేస్తానన్నారు.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ బరిలో 35 మంది అభ్యర్థులు

ఏలూరు(మెట్రో): తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో 35 మంది నిలిచారు. గురువారం 8 మంది అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. మొత్తం 54 మంది నామినేషన్లు దాఖలు చేయగా 11 మంది నామినేషన్లను అధికారులు ఇప్పటికే తిరస్కరించారు. మరో 8 మంది నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. దీంతో ఎమ్మెల్సీ ఎన్నికల పోటీల్లో 35 మంది అభ్యర్థులు ఉన్నారు. ఈనెల 27న పోలింగ్ జరుగనుంది.

నామినేషన్ల ఉపసంహరణలు ఇలా..

స్వతంత్ర అభ్యర్థులు గద్దే విజయలక్ష్మి, డా.కవల నాగేశ్వరరావు, దుర్గారావు పచ్చిగోళ్ల, పేరాబత్తుల సత్యవాణి, బాలాజీ గుండుమోలు, పిళ్లంగోళ్ల లీలా నగేష్, సత్తిరాజు స్వామి, చక్రపాణి కోండ్రు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు.

పోటీలో ఉన్న అభ్యర్థులు : పేరాబత్తుల రాజశేఖరం (తెలుగుదేశం), కాట్రు నాగబాబు (తెలుగు నవగర్జన), షేక్ హుస్సేన్ (రిఫార్మ్ పార్టీ ఆఫ్ ఇండియా) కాగా స్వతంత్ర అభ్యర్థులు.. కట్టా వేణుగోపాలకృష్ణ, కాండ్రేగుల నరసింహం, కాశ్లారి కృష్ణ మోహన్, కుక్కల గోవిందరాజు, కునుకు హేమా కుమారి, కైలా లావణ్య, గౌతం బాబు కొల్లు, చిక్కాల దుర్గారావు, తాళ్లూరి రమేష్, దత్తాత్రేయ నోరి, దిడ్ల వీరరాఘవులు, దొరబాబు యాళ్ల, నీతిపూడి సత్యనారాయణ, పినిపే నాగభూషణవర్మ, పిప్పళ్ల సుప్రజ, పేపకాయల రాజేంద్ర, బొడ్డు శ్రీనివాసరావు, బొమ్మనబోయిన వీఎస్ఆర్ మూర్తి, బొమ్మిడి సన్నిరాజ్, బండారు రామమోహన్ రావు, భీమేశ్వరరావు చిక్కా, మాకే దేవిప్రసాద్, మెర్ల శాస్త్రులు, మోకన అంబేడ్కర్, రాజపూడి, జెటి రామారావు, రేవులగడ్డ మహేష్ బాబు, వానపల్లి శివగణేష్, ఎం.శ్రీనివాసరావు, శ్రీనివాస్ విష్ణువఝుల, జీవీ సుందర్, హసన్ షరీఫ్ పోటీలో ఉన్నారు.

ఉమ్మడి జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జిగా మన్మథరావు

ఏలూరు (టూటౌన్): రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలకు పోర్టుఫోలియో జడ్జిలను నియమిస్తూ హైకోర్టు రిజిస్ట్రార్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జిగా జస్టిస్ డాక్టర్ కె.మన్మథరావును నియమించారు.

క్లుప్తంగా

ముగిసిన బధిరుల రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు



బధిరుల క్రికెట్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

భీమవరం: బధిరులు అన్ని రంగాల్లోనూ రాణించాలని, వారిని ప్రోత్సహించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని రాష్ట్ర మున్సిపల్ మినిస్టీరియల్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.కృష్ణమోహన్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ స్పోర్ట్స్ ఫెడరేషన్ ఆఫ్ ద డెఫ్ ఆధ్వర్యంలో రెండురోజుల పాటు డీఎన్నార్ కళాశాల గన్నాబత్తుల క్రీడామైదానంలో నిర్వహించిన 5వ రాష్ట్రస్థాయి టి20 క్రికెట్ పోటీలు గురువారం ముగిశాయి. పోటీల్లో గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జట్టు ప్రథమ స్థానం సాధించగా శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జట్టు ద్వితీయస్థానంలో నిలిచారని అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు చెరుకువాడ రంగసాయి తెలిపారు. అనంతరం విజేతలకు ట్రోఫీ, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల పాలకవర్గ సభ్యులు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

డీఏఎఫ్ సభ్యుడిగా సుబ్బయ్య


నియామక పత్రం అందుకుంటున్న సుబ్బయ్య

భీమవరం: కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వశాఖ అనుబంధ సంస్థ (డీఏఎఫ్) భారత ప్రభుత్వం అఖిల భారత బోర్డు సభ్యుడిగా భీమవరం పట్టణానికి చెందిన గరికిముక్కు సుబ్బయ్య నియమితులయ్యారు. గురువారం న్యూఢిల్లీలో జరిగిన డీఏఎఫ్ జనరల్‌బాడీ సమావేశంలో సుబ్బయ్యకు కేంద్రమంత్రి వీరేంద్ర కుమార్ నియామక ఉత్వర్తులివ్వగా బోర్డు జనరల్ సెక్రటరీ ప్రభాత్ కుమార్‌సింగ్ నియామక పత్రం అందజేశారు. సమావేశంలో ఎస్సీ కులాలకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి కేంద్ర ప్రభుత్వం చర్చించినట్లు సుబ్బయ్య చెప్పారు. ఈ సందర్భంగా సుబ్బయ్యను కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై సత్యకుమార్ అభినందించారు.

ట్రిపుల్ ఐటీలో పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్, ఫ్యాకల్టీలు

నూజివీడు : స్థానిక ట్రిపుల్‌ఐటీ ఆవరణలో ఉన్న శ్రీకాకుళం ఇంజినీరింగ్ విభాగంలో మార్చి 3, 4 తేదీల్లో నిర్వహించే జాతీయ వర్క్‌షాప్‌నకు సంబంధించి గురువారం ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ ఆచార్య సంద్ర అమరేంద్ర కుమార్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'స్మార్ట్ టూల్స్ అండ్‌స్మార్టర్ డిజైన్స్' అనే అంశంపై సివిల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు వర్క్‌షాప్ నిర్వహిస్తారన్నారు. సివిల్ ఇంజినీరింగ్ సాధనాలు, సాంకేతికతలపై ఈ వర్క్‌షాప్‌లో విద్యార్థుల్లో అవగాహన పెంపొందించడం జరుగుతుందన్నారు. నిపుణుల చర్చలు, ఆచరణాత్మక శిక్షణ, ఇంటరాక్టివ్ చర్చలు నిర్వహిస్తారన్నారు. ఆర్జీయూకేటీ డీన్ దువ్వూరి శ్రావణితదితరులు పాల్గొన్నారు.

మహాప్రసాదం.. వితరణకు సిద్ధం

- నేడు మావుళ్లమ్మ తల్లికి మహానైవేద్యం సమర్పణ
- అనంతరం లక్షమందికి అన్నసమారాధన
- ఉదయం 8 నుంచి రాత్రి 10 గంటల వరకు అన్నదానం
- గురువారం సాయంత్రం నుంచే వంటలు, భోజన ఏర్పాట్లు


వంటకు కూరగాయలను సిద్ధం చేస్తున్న దృశ్యం


శ్రీమావుళ్లమ్మ అమ్మవారు

భీమవరం (ప్రకాశం చౌక్) : భీమవరం పట్టణ ఇలవేల్పు శ్రీమావుళ్లమ్మ అమ్మవారి 61వ వార్షిక మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారి ఆలయం వద్ద అఖండ అన్నసమారాధన నిర్వహించనున్నారు. పట్టణంతో పాటు జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చే సుమారు లక్ష మంది భక్తులకు అమ్మవారి అన్నప్రసాదాన్ని అందించేందుకు ఉత్సవాల నిర్వాహకులు నీరుల్లి కూరగాయ పండ్లు వర్తక సంఘం, అమ్మవారి ఉత్సవ కమిటీ ఏర్పాట్లు పూర్తి చేశారు. అన్నదానం కోసం అవసరమైన కూరగాయలు, బియ్యం ఇతర వస్తువులను గురువారం ఉదయమే అమ్మవారి ఆలయం వద్దకు చేర్చి గురువారం సాయంత్రం నుంచే వంటలను తయారు చేయడం ప్రారంభించారు. శుక్రవారం ఉదయం భక్తులు ప్రత్యేక కూలైనుల్లో వచ్చి అమ్మవారి ప్రసాదం స్వీకరించి సంతృప్తి చెందేలా సర్వం సిద్ధం చేశారు.


అన్నప్రసాదం తయారు చేస్తున్న దృశ్యం


నైవేద్యానికి సిద్ధమవుతున్న పులిహోర

భోజనం మెనూ ఇలా

అమ్మవారి అన్నదాన ప్రసాదంలో చక్ర పొంగలి, పులిహోర, అన్నం, బంగాళదుంప కుర్మా, వంకాయ కర్రీ, ఆవకాయ పచ్చడి, సాంబారు, పెరుగు. వాటితో పాటు భక్తులు తీసుకువచ్చే పలు రకాల పిండి వంటలు, స్వీట్లు ఉంటాయి.

అమ్మకు మహానైవేద్యం

శ్రీమావుళ్లమ్మ అమ్మవారికి శుక్రవారం ఉదయం 7.30 గంటలకు ప్రత్యేక పూజల నడుమ మహానైవేద్యం సమర్పిస్తారు. పలు రకాల పిండి వంటలు, స్వీట్లు, పులిహోర ఇతర ప్రత్యేక ప్రసాదాలతో అమ్మవారికి మహానైవేద్యం సమర్పిస్తారు. అనంతరం అన్నదాన ప్రసాదం వితరణ ప్రారంభించడం జరుగుతుంది.

పోలీసు బందోబస్తు

అమ్మవారి అన్నదాన ప్రసాదం స్వీకరించడానికి భారీగా భక్తులు తరలిరానున్న నేపథ్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. భీమవరం డీఎస్పీ జయసూర్య పర్యవేక్షణలో 5గురు సీఐలు, 10 మంది ఎస్సైలు, 150 మంది పోలీసు సిబ్బంది సేవలు అందించడం జరుగుతుంది. భోజనం చేసే ప్రాంతాల వద్ద, జనం లోపలికి, బయటకు వెళ్లే మార్గాల వద్ద ఎటువంటి ఇబ్బందులు లేకుండా వారు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.

జాతరకు గుబ్బల మంగమ్మ


గుబ్బల మంగమ్మ గుడి వద్ద గిరిజనుల సందడి

బుట్టాయగూడెం: అడవిలో గుహలో కొలువైఉన్న గుబ్బల మంగమ్మతల్లిని కామవరం సమీపంలో జరుగుతున్న గ్రామ దేవతల జాతరకు గురువారం తీసుకువచ్చారు. ఆలయ పీఠాధిపతి వర్సా పుల్లారావు ఆధ్వర్యంలో ఆలయ కమిటీ వారు అమ్మవారిని నెమలిపొన్నుపై కూర్చోపెట్టి గుడి నుంచి కామవరం వరకూ డోలువాయిద్యాలు, సన్నాయి మేళాలతో నృత్యాలు చేస్తూ రాజు గద్దెల మీద తీసుకువచ్చారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆదివాసీల సాంప్రదాయంలో అమ్మవారికి పూజలు నిర్వహించారు. జాతర రెండోరోజు కూడా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మోటారుసైకిళ్ల చోరీ కేసులో 7 నెలల జైలు

భీమవరం: మోటార్‌సైకిళ్ల చోరీ కేసులో ముద్దాయికి 7 నెలల జైలు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పు ఇచ్చింది. ఎస్సై బీవై కిరణ్‌కుమార్ తెలిపిన వివరాలివి. స్థానిక వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గతేడాది మోటారు సైకిళ్ల దొంగతనానికి పాల్పడిన బోను మోజేష్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చగా విచారణానంతరం నేరం రుజువు కావడంతో జడ్జి డి ధనరాజు 7 నెలల జైలు శిక్ష విధిస్తూ గురువారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ సుజాత వాదనలు వినిపించగా వన్‌టౌన్ కానిస్టేబుల్ మురళీ సహకరించారు.

లారీ ఢీకొని వృద్ధురాలు మృతి

యలమంచిలి: లారీ ఢీకొని ఓ వృద్ధురాలు మృతి చెందింది. వివరాలు ఇలా ఉన్నాయి. యలమంచిలి గ్రామానికి చెందిన తలుపూరి విజయ (62) తన ఇంటి సమీపంలోనే నడిచి వెళ్తుండగా గ్రామంలోని బ్రాందీషాపు సమీపంలో కొబ్బరికాయ లోడు లారీ ఆమెను ఢీకొంది. ఆమె రెండు కాళ్లపై లారీ చక్రాలు ఎక్కడంతో స్థానికులు 108లో పాలకొల్లు ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గ మధ్యలో ఆమె మృతి చెందింది. విజయ భర్త గతంలోనే మరణించగా ఆమెకు వివాహితులైన ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

నరసాపురం: పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి వెనుక ప్రాంతానికి చెందిన పతం నర్సింహామూర్తి (38) గురువారం పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. టౌన్ ఎస్సై ముత్యాలరావు తెలిపిన వివరాలివి. ఓ గ్లాస్ వర్క్ షాపులో పనిచేసే నర్సింహమూర్తి ఇటీవల మద్యానికి బానిసయ్యాడు. గురువారం ఉదయం పనికి వెళుతున్నట్టు ఇంట్లో చెప్పి వైఎస్సార్ నగర్ పార్కు వద్ద పురుగుమందు సేవించాడు. ఇంటికి తిరిగి వచ్చి వాంతులు చేసుకోవడంతో అనుమానం వచ్చిన కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ నర్సింహమూర్తి మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

వాసవీధాం.. తమిళ భక్తుల కోలాహలం



తమిళనాడు సేలం భక్తులతో నిండిపోయిన 102 రుషి గోత్ర మందిరం, పెనుగొండ వాసవీ ధాంలో కొలువుదీరిన వాసవీ మాత (ఇన్‌సెట్‌లో)

పెనుగొండ: అఖిల భారత శ్రీ వాసవీ పెనుగొండ టెంపుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలోని పెనుగొండ వాసవీ శాంతి థాం గురువారం తమిళనాడు సేలం నుంచి వచ్చిన వాసవీ భక్తులతో కోలాహలంగా మారింది. తమిళనాడు ఆర్యవైశ్య మహాసభ సెలం డిస్ట్రిక్ట్ నుంచి సుమారు వెయ్యి మంది వాసవీ భక్తులు ప్రత్యేక రైలులో తరలి వచ్చారు. ఉదయం 8 గంటలకు పెనుగొండ క్షేత్ర పీఠాధిపతి ప్రజ్ఞానంద సరస్వతీ స్వామిజీ(బాలా స్వామి) ఆశీస్సులతో ఆలయ అర్చకుడు శిష్టా మణికంఠ ఆధ్వర్యంలో గోమాత పూజ నిర్వహించారు. అనంతరం వాసవీ మాతను ప్రత్యేకంగా అలంకరించి వాసవీ ప్రతిమలను ఏర్పాటు చేసి మహా చండీ హోమం నిర్వహించారు. అనంతరం మహా పూర్ణాహుతి సమర్పించారు. తమిళనాడు ఆచారాలతో తంబతి పూజను జరిపారు. ప్రత్యేక వాయిద్యాలు, ప్రత్యేక నాద బృందాలు ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో మహాసభ చైర్మన్ వీఎస్ శ్రీనివాసన్, కార్యదర్శి ఎం సురేంద్రన్, కోశాధికారి ఎస్ గోపాల మురుగన్, పీఆర్‌టీజే ప్రభాకరన్, స్థానిక ఈసీ సభ్యులు పాల్గొన్నారు.

నేటి కార్యక్రమాలు

రెండోరోజు ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో మూలవిరాట్ శ్రీనగరేశ్వర మహిషాసురమర్దనీ వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నారు. అనంతరం మాతంకి సేవ, మహాదీపోత్సవం నిర్వహిస్తారు. మధ్యాహ్నం 4.30 గంటల నుంచి భారీ గ్రామోత్సవం నిర్వహించనున్నారు.

నారసింహునికి శ్రీపుష్పయాగోత్సవం

సుందరగిరిపై ముగిసిన కల్యాణోత్సవాలు


స్వామివారికి హారతులిస్తున్న అర్చకుడు

ద్వారకాతిరుమల : శ్రీవారి ఆలయానికి దత్తత ఆయమైన ఐఎస్ జగన్నాధపురంలోని సుందరగిరిపై స్వయంభూగా కొలువైన శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారి దివ్య కల్యాణ మహోత్సవాలు గురువారం జరిగిన విశేష కార్యక్రమాలతో ముగిశాయి. భీష్మ ఏకాదశి పర్వదినం మొదలుగా ఆరు రోజుల పాటు ఈ ఉత్సవాలను స్మార్త ఆగమ యుక్తంగా, పాంఛాహ్నిక దీక్షతో ఆలయ పండితులు, అర్చకులు కన్నులపండువగా నిర్వహించారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆలయానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి నారసింహుడిని దర్శించుకున్నారు. ఆలయ ఆవరణలో భక్తులకు దేవస్థానం అన్నప్రసాదాన్ని అందజేసింది. సాయంత్రం ఆలయంలో ద్వాదశకోవెల ప్రదక్షిణలు అనంతరం పవళింపు సేవలను వేద మంత్రోచ్ఛరణల నడుమ అర్చకులు, పండితులు ఘనంగా నిర్వహించారు.


ధ్వజస్తంభ ప్రాంతంలో భక్తుల రద్దీ

లింగారాయుడిగూడెంలో డ్రెయినేజీల ప్రక్షాళన

సాక్షి స్పందన

తాడేపల్లిగూడెం రూరల్: గూడెం మండలం దండగర్ర పంచాయతీ పరిధి లింగారాయుడిగూడెంలో గురువారం డ్రెయినేజీ ప్రక్షాళన పనులు చేపట్టారు. గ్రామంలో అధ్వానంగా ఉన్న డ్రెయినేజీ వ్యవస్థపై సాక్షి దినపత్రికలో 'రోడ్లపై మురుగునీరు' శీర్షికన కథనం ప్రచురించింది. దీంతో గ్రామ సర్పంచ్ పిల్లా రాంబాబు ఆధ్వర్యంలో డ్రెయినేజీ పనులను చేపట్టారు. అలాగే, ఎల్.అగ్రహారం గ్రామంలో డ్రెయినేజీలో పూడిక చేపట్టారు. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


లింగారాయుడిగూడెంలో డ్రెయినేజీలను శుభ్రం చేయిస్తున్న దృశ్యం

వ్యక్తి ఆత్మహత్యాయత్నం.. కాపాడిన పోలీసులు


పోలీసులు పట్టుకున్న వ్యక్తి ధనుష్ (మధ్యలో)

భీమడోలు: చేసిన అప్పులు తన తండ్రి తీర్చడం లేదని ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా పోలీసులు అతడిని పట్టుకుని కౌన్సిలింగ్ ఇచ్చిన ఘటన ఇది. వివరాల్లోకి వెళ్లితే.. కురెళ్లగూడెంకు చెందిన కీళ్ల ధనుష్ ఆక్వాలో ఎలక్ట్రీషియన్ పనులు చేస్తుంటాడు. కుటుంబ అవసరాల నిమిత్తం తన స్నేహితుడు వద్ద అప్పు చేసి తండ్రి సీతారామయ్యకు ఇచ్చాడు. అనంతరం అప్పు తీర్చమని ధనుష్ తన తండ్రిపై ఒత్తిడి తీసుకురాగా ఆయన మందలించాడు. దీంతో మనస్తాపం చెందిన ధనుష్ ఇంటి నుంచి వెళ్లిపోయి ఆత్మహత్య చేసుకుంటున్నానని తండ్రికి ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చాడు. ఆందోళన గురైన సీతారామయ్య వెంటనే 112కు ఫోన్ చేసి భీమడోలు పోలీసులను ఆశ్రయించాడు. ఎస్సై వై.సుధాకర్‌తో పాటు ఐటీ టీం ఏఎస్సై వెంకటేశ్వరరావు, పోలీస్ కానిస్టేబుళ్లు సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా అదే గ్రామంలోని పంట పొలాల్లో ఉన్న ధనుష్‌ను పట్టుకున్నారు. అతడిని భీమడోలు పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్లి కౌన్సిలింగ్ ఇచ్చి తండ్రి సీతారామయ్యకు అప్పగించారు.

స్పా సెంటర్ నిర్వాహకులకు రిమాండ్

ఏలూరు టౌన్: అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తున్నారనే ఆరోపణలతో అరెస్ట్ అయిన ఎస్ఎస్ బ్యూటీ యూనిసెక్స్ బ్యూటీపార్లర్ నిర్వాహకులకు కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. వివరాల ప్రకారం.. స్థానిక కట్టా సుబ్బారావు వీధి ప్రాంతంలో ఎస్ఎస్ బ్యూటీ యూనిసెక్స్ బ్యూటీ పార్లర్ పేరుతో హెయిర్ కటింగ్, బ్యూటీషియన్, స్పా కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. అయితే కొందరు యువతులకు బ్యూటీషియన్ కోర్సులు నేర్పుతామంటూ మాయమాటలు చెప్పి వారితో వ్యభిచారం, క్రాస్ మసాజ్‌లు చేయిస్తున్నట్లు వచ్చిన సమాచారంతో ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ పర్యవేక్షణలో ఈనెల 11వ తేదీ రాత్రి టూటౌన్ సీఐ రమణ తన సిబ్బందితో దాడులు చేశారు. నిర్వాహకులు నమ్మిన నాగార్జున, అతని భార్య దుర్గ, దివ్యను అరెస్ట్ చేయగా భానుప్రకాష్, నరేంద్ర పరారీలో ఉన్నారు. గురువారం కోర్టులో హాజరుపర్చిన నాగార్జున, దుర్గ, దివ్యలకు న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించారు. పరారీలో ఉన్న ఇద్దరు వ్యక్తుల కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

ఉపాధ్యాయులంతా వైఎస్సార్ సీపీ వైపే


వైఎస్ జగన్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న గెద్దం సుధీర్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా ఉపాధ్యాయులంతా వైఎస్సార్ సీపీ వైపే ఉంటారని వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గెద్దం సుధీర్ అన్నారు. గురువారం ఆయన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని క్యాంపు కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సుధీర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయులను రాచి రంపాన పెడుతోందని, ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత కేవలం 8 నెలల్లో అమలు చేసిన విధానాలకే విసుగు చెందారన్నారు. ఉపాధ్యాయులకు మారుమూల గ్రామాల్లో శిక్షణ నిర్వహించడంతో అత్యవసర వైద్యం అందక కొందరు ఉపాధ్యాయ మిత్రులను కోల్పోవడం వారిలో ఆగ్రహాన్ని నింపిందన్నారు. అలాగే ప్రశ్నపత్రాలను అప్పటికప్పుడు పోలీస్‌స్టేషన్ల నుంచో, స్కూల్ కాంప్లెక్సుల నుంచే తీసుకువెళ్లాల్సి రావడంతో కొందరు రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందడం వారి ఆగ్రహాన్ని రెట్టింపు చేసిందన్నారు. దీనితో పాటు సీపీఎస్ రద్దుపై ఎటువంటి ప్రకటన చేయకపోవడం, నెలవారీ బదిలీలు పేరిట కొత్త విధానాన్ని తెరపైకి తీసుకురావడం వంటి అంశాలను ఉపాధ్యాయులు వ్యతిరేకిస్తున్నారన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అమలు చేసిన ఉపాధ్యాయ అనుకూల విధానాలు ఇప్పుడు ఉపాధ్యాయులకు అర్థమవుతున్నాయని, దీంతో రాష్ట్రంలో ఉపాధ్యాయులంతా పశ్చాత్తాప పడుతున్నారని వివరించారు. రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా ఉపాధ్యాయులు వైఎస్సార్ సీపీ వైపే ఉంటారని వైఎస్ జగన్‌కు వివరించినట్లు తెలిపారు.

సారాపై ఉక్కుపాదం

రాష్ట్ర ఎక్సైజ్ శాఖ డైరెక్టర్ రాహుల్‌దేవ్ శర్మ

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లాలో నాటుసారా తయారీ, విక్రయాలు, రవాణాపై ఉక్కుపాదం మోపాలని డైరెక్టర్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎక్సైజ్ రాహుల్‌దేవ్ శర్మ చెప్పారు. ఏలూరులోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ బీ.శ్రీలత, అసిస్టెంట్ కమిషనర్ కేవీఎన్ ప్రభుకుమార్‌తో కలిసి గురువారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. రాహుల్‌దేవ్ శర్మ మాట్లాడుతూ కేసులు పెట్టినా సారా తయారీ, విక్రయాలు చేస్తున్న వ్యక్తులపై పీడీ యాక్ట్ కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. పాత సారా తయారీ నిందితులపై, అనుమానితులపై ప్రత్యేక దృష్టి సారిస్తూ నిఘా ఉంచాలన్నారు. సారా కేసుల్లో ఉన్న నిందితులపై హిస్టరీ షీట్ తెరవాలని ఆయన ఆదేశించారు. సమీక్షలో ఎక్సైజ్ శాఖ జిల్లా అధికారి ఆవులయ్య, జీ.పాండురంగారావు, అసిస్టెంట్ సూపరింటెండెంట్ అజయ్‌కుమార్ సింగ్, జిల్లాలోని ఎక్సైజ్ శాఖ అధికారులు ఉన్నారు.

ఉమామహేశ్వరంలో చోరీ

పెంటపాడు: పెంటపాడు మండలం ఉమామహేశ్వరం గ్రామంలో గురువారం తెల్లవారు జామున ఓ ఇంట్లో చోరీ జరిగింది. 8 కాసుల బంగారు నగలతో పాటు, కొంత సొమ్ము చోరీకి గురైనట్లు బాధితులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కోడూరి సూర్యారావు కృష్ణాయపాలెంలో ఉంటున్న తన కుమార్తె వద్దకు వెళ్లి తిరిగి గురువారం ఉదయం వచ్చి చూసేసరికి ఇంట్లో వస్తువులు చెల్లాచెదురుగా పడి ఉండడం, బంగారు నగలు, నగదు కనిపించకపోవడంతో దొంగతనం జరిగినట్లు గుర్తించి పెంటపాడు పోలీసులకు సమాచారం అందించారు. పెంటపాడు రూరల్ సీఐ రమేష్, ఎస్సై స్వామి, ఏలూరు క్లూస్‌టీం సభ్యులు ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు.

సీసీ ఫుటేజ్‌ల ద్వారా నిగ్గు తేల్చాలి

పోలవరం రూరల్: లబ్ధిదారులకు ఇవ్వాల్సిన జనవరి నెల పింఛన్ సొమ్ముకు సంబంధించి బ్యాంకు నుంచి విత్‌డ్రా చేసేటప్పుడు రూ.50 వేలు తక్కువ రావడంపై ఎంపీడీవో పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. పోలవరం ఎస్‌బీఐలో జనవరి నెల పింఛన్ సొమ్ముకు సంబంధించి రూ.50 వేలు బ్యాంకు అధికారులు తక్కువ ఇచ్చినట్లు పోలవరం ఎంపీడీవో కె.శ్రీనివాసరావు పేర్కొన్నారు. బ్యాంకులో పెన్షన్ సొమ్ము తీసుకునే సమయంలో ఒక్కసారిగా సీసీ కెమేరాలు ఆగినట్లు బ్యాంకు అధికారులు తెలిపారన్నారు. సీసీ ఫుటేజీలు చూడాలంటే రూ.880 ఖర్చు అవుతుందని బ్యాంకు అధికారులు తెలిపారని, ఆ సొమ్ము కడతామని చెప్పినప్పటికీ బ్యాంకు అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. దీంతో ఈ ఘటనపై నిగ్గు తేల్చాలని పోలవరం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. వృద్ధులకు ఇవ్వాల్సిన పింఛన్ మాత్రం ఆపకుండా కొత్తపట్టిసీమ సచివాలయ సిబ్బందికి అందజేయడం జరిగిందన్నారు.

● కోడ్ వర్తించదా?

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా.. కూటమి నేతలకు మాత్రం అది వర్తించదు అన్నట్లుగా ఉంది అధికారుల తీరు. ఎన్నికల కోడ్ కారణంగా గ్రామాల్లో రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు తొలగించాల్సి ఉంది. కానీ పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది మాత్రం కొన్ని పార్టీల రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు మాత్రమే తొలగించి జనసేన, టీడీపీ నేతల ఫ్లెక్సీల జోలికి మాత్రం వెళ్లడం లేదు.

– భీమవరం అర్బన్



భీమవరం ముఖద్వారం వద్ద ఇలా..


డీఎన్నార్ కళాశాల సమీపంలో..


బరువానిపేటలో కూటమి నాయకుల ఫ్లెక్సీ


గొల్లవానితిప్ప రోడ్డులో దేగాపురం వద్ద..

క్లుప్తంగా

చెత్తను సంపద కేంద్రాలకు తరలించాలి



రామన్నగూడెం గ్రామంలో చెత్త నుంచి సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో విశ్వనాథ్

తాడేపల్లిగూడెం రూరల్: గ్రామాల్లో చెత్తను సంపద కేంద్రాలకు తరలించాలని ఎంపీడీవో ఎం.విశ్వనాథ్ సూచించారు. మండలంలోని జగ్గన్నపేట, రామన్నగూడెం గ్రామాల్లోని చెత్త నుంచి సంపద కేంద్రాలను గురువారం ఎంపీడీవో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో తడి, పొడి చెత్తలను వేర్వేరుగా సేకరించాలన్నారు. ఈవోపీఆర్‌డీ ఎం.వెంకటేష్ మాట్లాడుతూ ప్రతీ కేంద్రంలో చెత్త విడదీసే కార్యక్రమం చేపట్టాలన్నారు. నూరు శాతం చెత్త సేకరణ జరగాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ములకాల సూర్యారావు, కార్యదర్శులు బాలకృష్ణ, వేణు, ఎమ్మార్వీ ఎం.రవి కిరణ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చికెన్, కోడిగుడ్ల విక్రయాలు చేయరాదు



పెదతాడేపల్లి గ్రామంలో మైక్ ప్రచారం చేయిస్తున్న ఎంపీడీవో ఎం.విశ్వనాథ్

తాడేపల్లిగూడెం రూరల్: బర్డ్ ఫ్లూ వ్యాప్తి చెందడంతో ముందు జాగ్రత్త చర్యగా చికెన్, కోడి గుడ్ల విక్రయాలు చేయరాదని ఎంపీడీవో ఎం.విశ్వనాథ్ హితవు పలికారు. ఉంగుటూరు మండలం బాదంపూడి గ్రామంలో బర్డ్ ఫ్లూ వ్యాధి వ్యాప్తి చెందడంతో ముందస్తుగా తాడేపల్లిగూడెం మండలం పెదతాడేపల్లి గ్రామాన్ని రెడ్‌జోన్‌గా గురువారం ప్రకటించారు. దీంతో గ్రామంలో టాం టాం వేసి ప్రజల్ని అప్రమత్తం చేశారు. దుకాణాలు వద్ద కోడిగుడ్లు విక్రయాలు చేయరాదని, చికెన్ విక్రయించరాదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి టి.రవిచంద్ర, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దోమల నివారణకు కృషి చేస్తున్నాం



హౌసింగ్ బోర్డులో స్ప్రే చేస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని అన్ని వార్డుల్లోనూ వివిధ తేదీలను కేటాయించి దోమల నివారణ మందు స్ప్రే చేయిస్తున్నామని, ఫాగింగ్ కార్యక్రమాలు జరుగుతున్నాయని మునిసిపల్ శానిటరీ ఇనస్పెక్టర్ శ్రీమన్నారాయణ వెల్లడించారు. పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో పలు ప్రాంతాల్లో గురువారం ఫాగింగ్, దోమల నివారణ మందు చల్లించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమల నివారణకు పురపాలక సంఘంతో పాటు ప్రజలు కూడా సహకరించాలని, భాగస్వామ్యం కావాలని కోరారు. పరిసరాల్లో డ్రెయిన్లు నిరంతరం పారే విధంగాను, నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, చెత్త, చెదారాలను పారిశుద్ధ్య సిబ్బంది అందజేయాలని కోరారు.

రెవెన్యూ సదస్సుల అర్జీలపై విచారణ



వీరంపాలెం సచివాలయం వద్ద విచారణ చేస్తున్న సీసీఎల్ఏ అసిస్టెంట్ కమిషనర్ ఎన్.శ్రీనివాస్

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలో ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలపై అభ్యంతరాలను తెలుసుకునేందుకు గురువారం వీరంపాలెం, జగన్నాథపురం, దండగర్ర, కడియద్ద గ్రామ సచివాలయాల వద్ద సీసీఎల్ఏ అడిషనల్ అసిస్టెంట్ కమిషనర్ ఎన్. శ్రీనివాస్ (అమరావతి) విచ్చేశారు. ఈ సందర్భంగా అభ్యంతరాలపై విచారణ చేపట్టారు. ఆ వివరాలను నమోదు చేశారు. ఆయన వెంట తహసీల్దార్ ఎం.సునీల్ కుమార్, ఎంపీడీవో ఎం.విశ్వనాథ్ తదితరులు ఉన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

భీమవరం: రోడ్డు నిబంధనలను పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చునని అసిస్టెంట్ వెహికల్ ఇన్‌స్పెక్టర్స్ ఎ తేజ, సత్యనారాయణ అన్నారు. 36వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవంలో భాగంగా గురువారం భీమవరం ఏఆర్‌కెఆర్ మున్సిపల్ హైస్కూల్లో విద్యార్థులకు రోడ్‌సేఫ్టీపై నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. వాహనదారులకు రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించడానికి రోడ్డు భద్రతా వారోత్సవాలను ప్రతి ఏటా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వాహనాలలో ప్రయాణించేటప్పుడు సీట్ బెల్ట్ తప్పకుండా ధరించాలని సూచించారు.

ప్రజారోగ్యంతో పరిహాసమా !

- గ్రామాల్లో పడకేసిన పారిశుద్ధ్యం
- మొక్కుబడిగా స్వచ్ఛాంధ్ర..స్వచ్ఛ దివస్
- కుప్పలుతెప్పలుగా పేరుకుపోతున్న చెత్త
- పగలు, రాత్రి తేడా లేకుండా దోమల దండయాత్ర
- చోద్యం చూస్తున్న అధికారులు

పెంటపాడు: మండలం వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో పారిశుద్ధ్యం పడకేసింది. ఏ వీధిలో చూసినా కుప్పలు, తెప్పలుగా పేరుకుపోయిన చెత్త దర్శనమిస్తోంది. ప్రధాన రహదారులు, వీధులు, ప్రభుత్వ కార్యాలయాల్లో సైతం చెత్త కుప్పలు పేరుకుపోయాయి. గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు నిర్వహణను గాలికొదిలేశారు. ప్రధాన రోడ్ల పొడవునా, వీధుల్లో చెత్త పేరుకుపోవడంతో దోమలకు ఆవాసాలుగా మారాయి. పారిశుద్ధ్య కార్మికులు ఉన్న పంచాయతీల్లో సైతం పారిశుద్ధ్యాన్ని విస్మరించడం శోచనీయం. ఎక్కడ చూసినా అపరిశుభ్రతే తాండవిస్తోంది.

అలుముకున్న నిర్లక్ష్యం

సమయానికి విధులకు వచ్చామా..వెళ్లామా అనే ధ్యాసే తప్పా పనుల్లో జవాబుదారీ తనం కొరవడింది. పారిశుద్ధ్యంపై అధికారుల నిర్లక్ష్య ధోరణి బాగా పెరిగింది. మండల స్థాయి అధికారులు సైతం పారిశుద్ధ్యంపై పట్టించుకోవడం మానేశారు. స్వచ్ఛాంధ్ర– స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని ఆర్భాటంగా నిర్వహించడం మారునాడే వదిలేయడం పరిపాటిగా మారిపోయింది. పారిశుద్ధ్య నిర్వహణ చేతులెత్తేశారు. డ్రెయినేజీ వ్యవస్థ మారీ దారుణంగా ఉంది. మురుగు నీరు వెళ్లే దారి లేక ఎక్కడికక్కడే నీరు స్తంభించిపోయి దుర్వాసన వస్తోంది. గ్రామాల్లో పేరుకుపోతున్న చెత్త చెదారానికి తోడు దోమలు విపరీతంగా పెరిగిపోయాయి. దీంతో ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా పోతోంది. రాత్రి, పగల తేడా లేకుండా దోమలు ప్రజలపై దండయాత్ర చేస్తూ రోగాలకు గురి చేస్తున్నాయి. ప్రధానంగా బి. కొండేపాడు గ్రామంలో మీనవిల్లూరు వెళ్లే రోడ్డులో రోడ్డుపై చెత్త పేరుకుపోయింది. అదే గ్రామంలో పలు వీధులతో పాటు, ఎస్సీపేట ప్రాంతంలో డ్రెయినేజీలు రోడ్లపై పొంగి ప్రవహిస్తున్నాయి. లోలెవిల్ కాల్వకు ఆనుకొని ఉన్న గ్రామాల్లో చెత్తను డంపింగ్ యార్డులకు తరలించకుండా మిడ్‌లెవిల్ కాల్వలో చెత్తను పడేస్తున్నారు. కొండేపాడుతో పాటు, వల్లూరుపల్లి, రాచర్ల ఎస్సీ పేటలలో మురుగునీరు తరగక అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా పంట, తాగునీటి కాలువలు ఉన్న గ్రామాల్లో చెత్తను పంచాయతీలకు తరలించకుండా కాలువలను డంపింగ్ యార్డులుగా ఉపయోగిస్తున్నారు. అలంపురం, ప్రత్తిపాడు, రాచర్ల, వల్లూరుపల్లి, దర్శిపర్రు గ్రామాలతో పాటు, జట్లపాలెం మిడ్ లెవిల్ కాలువ ప్రాంతాల్లో కె. పెంటపాడు, బిళ్లగుంట, ప్రాంతాలలోని కాలువలో చెత్తను వేయడం వల్ల తాగునీరు కలుషితమవుతోంది. తక్షణమే ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



కొండేపాడు పంచాయతీ కార్యాలయం వద్ద తుప్పల్లో చెత్త రిక్షాలు





కొండేపాడులో రోడ్డు పక్కనే చెత్త వేసిన దృశ్యాలు



రాచర్ల మిడ్‌లెవెల్ కాలువ కొళాయి వద్ద అపరిశుభ్రంగా ఉన్న దృశ్యం

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక పాతూరు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మహాలక్ష్మినగర్ ఫీడర్‌కు ఈ నెల 14వ తేదీన విద్యుత్ మరమ్మతులు నిర్వహిస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ తాడేపల్లిగూడెం డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.నరసింహమూర్తి వెల్లడించారు. మహాలక్ష్మినగర్, టీటీడీ కల్యాణ మండపం రోడ్డు, సత్యవతినగర్, చెట్లు రోడ్డు, పాతూరు ఏరియాకు శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. పట్టణ విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని మాధవరం సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు విద్యుత్ ఈఈ కే.నరసింహమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. అత్యవసర మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామన్నారు. దీంతో మాధవరం, ఉప్పరగూడెం, తాళ్లపాలెం, కుంచనపల్లి సబ్ స్టేషన్ల పరిధి కుంచనపల్లి, మెట్ట ఉప్పరగూడెం, ఇటుకుల గుంట, ఆరుగొలను, కొత్తూరు, దండగర్ర, లింగారాయుడిగూడెం, నవాబుపాలెం, ఆరుళ్ల నందమూరు, మారంపల్లి గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

మాజీ మంత్రి కొట్టు పరామర్శలు



కొండ్రుప్రోలు జొన్నల అన్నవరం సత్యనారాయణను పరామర్శిస్తున్న మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కొండ్రుప్రోలు కేఎస్ఎన్ కాలనీకి చెందిన జొన్నల అన్నవరం సత్యనారాయణ భార్య, రామన్నగూడెంలో చింతా సోమేశ్వరరావు, వెంకట్రామన్నగూడెంలో బండారు నాగేశ్వరరావు కుమారుడు జయకృష్ణ ఇటీవల మృతి చెందారు. ఈ సందర్భంగా గురువారం వారి కుటుంబాలను మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ పరామర్శించారు. వారి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట రామన్నగూడెం సర్పంచ్ చింతా వెంకట్రావు, వైఎస్సార్ సీపీ నాయకులు పోలిమోను శ్రీనివాస్, సోషల్ మీడియా ఇన్‌చార్జ్ ఉదయ్ భాస్కర్, చిట్టూరి కాశీవిశ్వనాథం, పిచ్చుకల శ్రీనివాస్ ఉన్నారు.

ఎక్సైజ్ కేసులో వ్యక్తి అరెస్టు



పడాలలో బెల్ట్ షాపు నిర్వాహకుడిని అదుపులోకి తీసుకున్న ఎక్సైజ్ అధికారులు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని పడాల గ్రామంలో గురువారం ప్రొహిబిషన్, ఎక్సైజ్ సీఐ స్వరాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో ఎస్సైలు మురళీమోహన్, దొరబాబులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో బెల్ట్ షాపు నిర్వహిస్తున్న ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని, అతని వద్ద నుంచి ఐదు డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ స్వరాజ్యలక్ష్మి వివరించారు. ఎక్సైజ్ సిబ్బంది తనిఖీల్లో పాల్గొన్నారు.

మానసిక వికలాంగులకు మనోధైర్యాన్ని కల్పించాలి



బల్లిపాడులో మానసిక వికలాంగుడి కుటుంబ సభ్యుల నుంచి వివరాలు సేకరిస్తున్న దృశ్యం

అత్తిలి: మానసిక వికలాంగుల బాలల్లో మనోధైర్యాన్ని కల్పించాలని పలువురు వక్తలు తెలిపారు. మండలంలో హైకోర్టు ఆదేశాల మేరకు తణుకు 4వ జిల్లాకోర్టు అదనపు జడ్జి సూచనలతో గురువారం అత్తిలి మండలంలో గల గ్రామాల్లో పర్యటించి మానసిక వికలాంగుల ఇళ్లకు వెళ్లి వారిని కలుసుకొని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నామని పారాలీగల్ లాయర్ ఎ వెంకటేశ్వరరావు తెలిపారు. మానసిక విగలాంగత్వంకు గల కారణాలు, వాడుతున్న మందులు, ప్రభుత్వం నుంచి అందుతున్న సంక్షేమ పథకాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పారా లీగల్ వలంటీర్‌లు, పెన్మెత్స రామరాజు, డి బ్రహ్మాజీ, భవిత సెంటర్ ఉపాధ్యాయుడు జె ఏసురాజు, ఆయా గ్రామాల ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కల్లుగీత కార్మికుడికి రూ.2 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి



కల్లుగీత కార్మికుడు రామకృష్ణను పరామర్శిస్తున్న మునిస్వామి

తణుకు అర్బన్: తాడిచెట్టుపై నుంచి ప్రమాదవశాత్తూ పడిపోయి కాలు ఎముక విరిగి ఆస్పత్రిపాలైన గీత కార్మికుడు గూడవల్లి రామకృష్ణకు ప్రభుత్వం రూ. 2లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కామన మునిస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తణుకు మండలం కోనాల గ్రామానికి చెందిన రామకృష్ణ ఈ నెల12వ తేదీన కల్లుగీయుటకు తాడిచెట్టు ఎక్కి పైనుంచి పడిపోయారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఎక్స్‌గ్రేషియాని అమలు జరపాలని అదేవిధంగా ప్రతి తాడి, ఈత చెట్లపై ప్రభుత్వం పన్ను విధించి గీత కార్మికులకు ఆ చెట్టుపై హక్కును కల్పించాలని, లేనిచో గీత కార్మికులతో పెద్ద ఎత్తున ఉద్యమాన్ని చేపడుతామని మునిస్వామి హెచ్చరించారు. గురువారం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రామకృష్ణను మునిస్వామి పరామర్శించారు.

సోలార్ రూఫ్ టాప్‌ను నిర్మించుకోండి



మాట్లాడుతున్న మునిసిపల్ కమిషనర్ ఏసుబాబు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పీఎం సూర్యఘర్ విద్యుత్ పథకం రాయితీని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవడం ద్వారా సోలార్ రూఫ్ టాప్‌ను నిర్మించుకోవాలని మునిసిపల్ కమిషనర్ ఏసుబాబు తెలిపారు. ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ఆదేశాలు మేరకు మునిసిపల్ కార్యాలయంలో మహిళలకు సూర్యఘర్ విద్యుత్ పథకం, రాయితీలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సూర్య ఘర్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏసుబాబు మాట్లాడుతూ దేశంలో పేద, మధ్య తరగతి వర్గాలకు విద్యుత్ భారాలు తగ్గేందుకు సూర్య ఘర్ పథకం ఎంతో ఉపయుక్తమని చెప్పారు. ఈ పథకంలో రాయితీ కింద ఒక్కో కిలో వాట్‌కు రూ.30 వేలు సబ్సిడీని కేంద్రం అందజేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెప్మా చైర్మన్ గుండుమోగుల పద్మప్రియ, మధుశ్రీ, విద్యుత్ ఏడీఈ గంగాధర్, ఏఈ, బీసీ నాయకులు వర్తనపల్లి కాశీ తదితరులు పాల్గొన్నారు.

జస్టిస్ రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్‌ను రద్దు చేయాలి



మాట్లాడుతున్న చీకటిమిల్లి మంగరాజు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఎస్సీ వర్గీకరణ చేయడానికి ప్రభుత్వం నియమించిన జస్టిస్ రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్‌ను రద్దు చేయాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు అన్నారు. పట్టణంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సుప్రీం కోర్టు తీర్పులో ఎస్సీ, ఎస్టీల్లో ఎవరైతే వెనుకబడి ఉన్నారో వారిని గుర్తించి వారికి రిజర్వేషన్స్‌లో అధిక ప్రాధాన్యతను ఇవ్వాలని తీర్పు ఇస్తే, కుల గణనను చేయకుండా 2011 లెక్కలు ప్రకారం ఎస్సీ, ఎస్టీలకు కులాలు ప్రకారంగా రిజర్వేషన్లు కల్పిస్తున్నారని, ఇది రాజ్యాంగానికి, సుప్రీంకోర్టు తీర్పుకు వ్యతిరేకమని తెలిపారు. ఏపీ, తెలంగాణా రాష్ట్రాలు తమ స్వార్థ ప్రయోజనాల కోసం ఎస్సీ వర్గీకరణ చేయాలని ప్రయత్నాలు చేస్తున్నాయని, ప్రభుత్వాలు రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్సీ వర్గీకరణ నిలుపుదల చేయాలని ఈ నెల 16వ తేదీన కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులో మాలల మహాగర్జన నిర్వహించడం జరుగుతుందన్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఉన్న మాల మహానాడు నాయకులు, కార్యకర్తలు పాల్గొని, మాలల సత్తా చూపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుంకర సీతారాం, మానుకొండ శ్రీను బాబు, మరపట్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

క్షేత్ర దర్శిని సేవలను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న క్షేత్రదర్శిని ప్రయాణీకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఏపీఎస్ ఆర్టీసీ ఆధ్యాత్మిక క్షేత్రాల దర్శన స్పెషల్ బస్సు ఎంతో సౌకర్యవంతంగా ఉందని భక్తులు, ప్రయాణీకులు పేర్కొన్నారు. 36 మంది భక్త ప్రయాణీకులతో అరుణాచలం గిరి ప్రదక్షిణ యాత్ర బస్సు గురువారం స్థానిక డిపోకు తిరిగి వచ్చిన సందర్భంగా భక్తులు మాట్లాడుతూ పౌర్ణమి రోజున అరుణాచల గిరి ప్రదక్షిణ, అరుణాచలేశ్వరుని దర్శనం ఎంతో పుణ్యం లభిస్తుందన్నారు. దారిపొడవున శ్రీకాళహస్తి, కాణిపాకం, శ్రీపురం మహాలక్ష్మిదేవి, గోల్డెన్ టెంపుల్, ఆయా ప్రదేశాలు దర్శనీయమైన స్థలాలు అన్నారు. ఆర్టీసీ ఆధ్వర్యంలో స్పెషల్ బస్సు, సురక్షితమైన డ్రైవర్లతో బస్సు ప్రయాణం సురక్షితంగాను, స్వామి, అమ్మవార్లు దర్శనాలు బాగా జరిగాయన్నారు. ఏపీఎస్ ఆర్టీసీ డిపో మేనేజర్ యేలూరి సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ ప్రయాణీకుల ఆదరణతో మరిన్ని యాత్ర స్పెషల్ బస్సులు భక్తులు కోసం నడుపుతామని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఘనంగా సరోజినీనాయుడు జయంతి



మాట్లాడుతున్న కాకర్ల రాజరాజేశ్వరి

ఆకివీడు: నేటి నారీ మణులకు స్వాతంత్ర్య సమర యోధురాలు, భారత తొలి మహిళా గవర్నర్ సరోజినీనాయుడు జీవితం ఆదర్శప్రాయమని విశ్రాంత హెచ్ఎం లయన్స్ ఆదర్శ క్లబ్ అధ్యక్షురాలు కాకర్ల రాజరాజేశ్వరి చెప్పారు. మండలంలోని దుంపగడప వీవీ గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ మహిళా దినోత్సవాన్ని గురువారం ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుజాత అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాజేశ్వరి మాట్లాడుతూ సరోజినీనాయుడు సేవలను కొనియాడారు. దేశ భక్తితో సమసమాజ స్థాపనే ధ్యేయంగా ఆమె పనిచేశారన్నారు. భారత కోకిల బిరుదు పొందిన ఆమె జయంతిని ప్రభుత్వం మహిళా సాధికారిత జాతీయ దినోత్సవంగా నిర్వహించడం గర్వించదగిన విషయమన్నారు. ప్రిన్సిపాల్ సుజాత మాట్లాడుతూ మహిళలు సాధికారత కోసం తీవ్రంగా పోరాడిన దిగ్గజ మహిళ అన్నారు. క్లబ్ కార్యదర్శి, మెప్మా మాజీ అధ్యక్షురాలు మోరా జ్యోతిరెడ్డి మాట్లాడుతూ సరోజినీనాయుడు జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం అధ్యక్షకార్యదర్శులు రాజేశ్వరి, జ్యోతిలను ప్రిన్సిపాల్ సుజాత, అధ్యాపకులు ఘనంగా సత్కరించారు.

గ్యాస్ సబ్సిడీలపై తనిఖీ



గ్యాస్ సబ్సిడీలపై తనిఖీ చేస్తున్న తహసీల్దార్ ఎస్.వెంకటేశ్వరరావు

ఆకివీడు: ఉచిత గ్యాస్ పంపిణీలో భాగంగా లబ్ధిదారులకు సబ్సిడీ వారి ఖాతాల్లో పడుతుందో?లేదో? పరిశీలిస్తున్నట్లు తహసీల్దార్ ఎస్.వెంకటేశ్వరరావు చెప్పారు. ప్రభుత్వం ఏటా మూడు ఉచిత సిలిండర్లను లబ్ధిదారులకు అందజేస్తుందని, వినియోగదారుడు ముందుగా గ్యాస్ సిలిండర్ ధరను చెల్లించాల్సి ఉందన్నారు. చెల్లించిన సొమ్ము వారి ఖాతాల్లోకి ప్రభుత్వం జమ చేస్తున్నట్లు చెప్పారు. ఆ విధంగా సబ్సిడీ పడని వారుంటే వారి వివరాల్ని సేకరించి, ఆన్‌లైన్‌లో లోపాల్ని సరిజేస్తామన్నారు. తొలుత డీలర్ వద్ద ఉచిత సిలిండర్లు పొందిన వారి వివరాలను పరిశీలించారు. అనంతరం లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వారి గ్యాస్ పుస్తకం, ఆధార్, తదితర వాటిని పరిశీలించారు. తనిఖీల్లో ఆర్ఐ వంటపాటి ఆంజనేయులు పాల్గొన్నారు.

వైభవంగా రామలింగేశ్వరుడి విగ్రహ ప్రతిష్ఠ

అశేష జనసందోహం మధ్య ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపన



ఆకివీడు: సిద్ధాపురం గ్రామంలో నూతనంగా ప్రతిష్ఠించిన పర్వత వర్ధిని రామలింగేశ్వరుడి విగ్రహం



ఆలయ ప్రాంగణంలో అశేష జనసందోహం మధ్య ధ్వజ స్తంభాన్ని ప్రతిష్ఠిస్తున్న దృశ్యం

ఆకివీడు: సిద్ధులు పర్యటించిన కొల్లేరు సరస్సు తీర గ్రామం సిద్ధాపురంలో మరో ప్రతిష్ఠాత్మకమైన రామలింగేశ్వరుడి ఆలయం వెలిసింది. బ్రహ్మసూత్రంతో లభించిన శివలింగానికి దాతల సహకారంతో ఆలయం నిర్మించారు. నూతన ఆలయంలో స్వామివార్ల ప్రతిష్ఠా కార్యక్రమం హోరెత్తిన శివ నామ స్మరణ మధ్య పర్వత వర్ధినీ రామలింగేశ్వర స్వామి ప్రతిష్ఠ గురువారం మధ్యాహ్నం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణం ముందు అశేష భక్త జనసందోహం మధ్య శివహోం, శివహోం అంటూ ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపన చేశారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద నిర్వహిస్తున్న మహా హోమం పూర్ణాహుతి కార్యక్రమం ముగిసింది. ఆలయాల నిర్మాణాన్ని కంచి కామకోటి పీఠాధిపతుల దివ్య ఆశీస్సులతో ప్రముఖ వాస్తు సిద్ధాంతులు సబ్బయ్య స్తపతి, స్వామినాథన్ స్థపతి(శివ) కాంచీపురం పర్యవేక్షణలో నిర్మాణాన్ని చేపట్టారు. ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని ఆలయ నిర్మాణకర్త భూపతిరాజు తిమ్మరాజు దంపతులు, అల్లూరి సోమరాజు దంపతుల సమక్షంలో నిర్వహించారు. అనంతరం భారీ అఖండ అన్నసమారాధన నిర్వహించారు.

ప్రేరణాయుతమైన విద్యాబోధన అవసరం



నైపుణ్యాభివృద్ధి సదస్సులో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు

పెనుగొండ: విద్యార్థుల అభ్యాసాన్ని మెరుగుపరిచే విధంగా ప్రేరణాయుతంగా అధ్యాపకుల బోధన ఉండాలని ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయ ఆంగ్ల విభాగ అధ్యాపకులు, ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య డి.జ్యోతిర్మయి అన్నారు. అఖిల భారత సాంకేతిక విద్యా మండలి సౌజన్యంతో ఆదికవి నన్నయ్య యూనివర్శిటీ, పెనుగొండ ఎస్వీకేపీ అండ్ డాక్టర్ కేఎస్‌రాజు కళాశాల సంయుక్తంగా కళాశాలలో నిర్వహిస్తున్న నైపుణ్యాభివృద్ధి ఐదు రోజుల అవగాహన సదస్సులో గురువారం పాల్గొన్నారు., అధ్యాపకులు నిరంతర విద్యార్థులుగా ఉన్ననాడే సమాజంలో మంచి విద్యార్థులను తయారు చేయగలుగుతారన్నారు. తరగతి గదిలో నిర్మలమైన వాతావరణాన్ని సృష్టించాలన్నారు. అధ్యాపకులు మూల్యాంకణలో తగుజాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమాలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీవీ అప్పారావు, ఐక్యూసీ కో ఆర్డినేటరు కే శశికుమార్, సదస్సు కో ఆర్డినేటర్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.